క్లుప్తంగా

నేడు భూ కబ్జాలపై అఖిలపక్షం ఆందోళన

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరంలో ప్రభుత్వ భూములు, స్థలాలను ప్రైవేటు వ్యక్తుల కబ్జాలు రోజురోజుకు పెరుగుతున్నాయని సీపీఎం నగర కార్యదర్శి రామమోహన్ అన్నారు. కబ్జాలను అరికట్టడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైందని, దీనిని నివారించడానికి ఈనెల 30 న కడప నగరం అంబేద్కర్ సర్కిల్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కడప నగరంలో దాదాపు 700 ఎకరాలు ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల పేర్లతో బదలాయింపు జరిగిందని, దీని మీద సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కబ్జాకు కావేవి అనర్హం అన్నట్లు శ్మశానాలు, కాలువలు, వంకలు ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయటం వల్ల భవిష్యత్తులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. భూకబ్జాదారులకు రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు పెద్ద ఎత్తున సహకారం అందించడం వల్లనే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు.

పంట నమోదు చేసుకోవాలి



వరిపంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: పంటలు సాగుచేసిన ప్రతి రైతు తప్పకుండా పంట నమోదు చేసుకోవాలని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాత కడపలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగు చేసిన ప్రతి రైతు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ నెంబర్ తీసుకుని వ్యవసాయశాఖ సిబ్బందిని కలిసి పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే కౌలు రైతులు ఎవరైనా ఉంటే కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కౌలు రైతులు రెవిన్యూశాఖ వారిని సంప్రదించి కౌలు కార్డుకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి దస్తగిరి, ఆత్మ ఏటీఎం రాధికబాయ్, రైతులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప ఉక్కు పరిశ్రమ కుటీర పరిశ్రమ కాకూడదని కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ కోఆర్డినేటర్ ఎస్ఏ సత్తార్, కాంగ్రెస్ నాయకుడు బండి జకరయ్య పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంలో విభజన హామీలలో భాగంగా ఆంధ్ర రాష్ట్రం వెనుక పడకూడదని ప్రత్యేక హోదాతో పాటుగా పలు అభివృద్ధి పథకాలు ప్రకటించి చట్టం చేసిందన్నారు. అందులో భాగంగా కడప ఉక్కు ఫ్యాక్టరీని సెయిల్ ఆధ్వర్యంలో నిర్మించేటట్లు అప్పటి కేంద్ర ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. తరువాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆ విషయాన్ని తుంగలో తొక్కిందన్నారు. ప్రభుత్వం వెంటనే ఉక్కు పరిశ్రమ ఏర్పాటుదిశగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్టిఐ చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య, మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు-అక్రమ్, మైనారిటీ సెల్ -నగర అధ్యక్షుడు-ఆసిఫ్ ఖాన్, బీసీ సెల్ చైర్మన్ - కులాయప్ప పాల్గొన్నారు.

ఘన నివాళి

కడప వైఎస్ఆర్ సర్కిల్: విప్లవ వీరుడు , భూస్వామ్య వ్యతిరేక పోరాట ధీరుడు మజుందర్ చారు అని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి బందెల ఓబయ్య పేర్కొ న్నారు. మంగవారం నగరంలోని వై జంక్షన్‌లో భూస్వామ్య వ్యతిరేక పోరాట ధీరుడు మజుందర్ చారు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా, పీడిత వర్గ ప్రయోజనం కోసం అనేక పోరాటాలు చేసి పేదల పక్షాన నిలబడిన కమ్యూనిస్టు ఉద్యమకారుడు చారు మజుందర్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎంవి రమణ, బి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

కక్ష పూరితంగా వ్యవహరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కడప రూరల్: ఆలయ కమిటీ సభ్యులు తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని పోరుమామిళ్లకి చెందిన జి. సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరుమామిళ్లలోని ఒక ఆలయ కమిటీకి గతంలో తను కార్యదర్శిగా పనిచేశానని తెలిపారు. ఇటీవల ఆ కమిటీ వారు తనపై కక్ష కట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆలయంలో తానిచ్చే టెంకాయ ఇతర పూజ సామాగ్రిని స్వీకరించడం లేదని అలాగే వారు భక్తులకు ఇచ్చే తీర్థప్రసాదాలు తనకు ఇవ్వడం లేదన్నారు. అదేవిధంగా తన ఇంట్లో జరిగే శుభ కార్యక్రమాలకు కూడా కమిటీ సభ్యులు ఎవరు రావడం లేదన్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తే, ఇది కుల కట్టుబాట్లకు సంబంధించిన అంశం అని పోలీసులు చెప్పడం దారుణం అన్నారు. వచ్చేనెల మూడవ తేదీన ఆలయ కమిటీ సమావేశం జరుగుతుందని ఈ సందర్భంగా ఏమైనా జరిగితే అందుకు పోలీసులే బాధ్యత వహించాలని అన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.





జలకళ.. చేపల కోసం వల





ఆదినిమ్మాయపల్లె వద్ద పెన్నానది జలకళ సంతరించుకుంది. కొత్తనీరు రావడంతో చేపలు పట్టేందుకు జాలర్లు వలలు విసురుతున్నారు. కొందరు నదిలో వల వేసి చేపలు పట్టడం కాకుండా నీటిపై ఎగిరే చేపలను పట్టేందుకు పైభాగంలో వలలు ఏర్పాటు చేసి ఎగురుతున్న చేపలు అందులో పడేలా చేస్తున్నారు. పెద్ద పెద్ద చేపలు ఎగిరి ఇందులో పడుతుండటంతో వారు ఉత్సాహంగా చేపల వేట కొనసాగిస్తున్నారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

జీఓ 137 రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో 13.83 ఎకరాలు ప్రభుత్వ భూములను, విజయవాడలో 4.15 ఎకరాల ఆర్టీసీ భూములను బహుళ జాతి సంస్థ లులు కు కట్టబెడుతూ విడుదల చేసిన 137 జీఓను తక్షణమే రద్దు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లులును ప్రోత్సహించడమంటే వేలాది మంది చిన్న వ్యాపారులను, లక్షలాది మంది ఉపాధిని దెబ్బకొట్టడమేనన్నారు. ఆర్టీసీ, ప్రభుత్వ రంగ ఆస్తులను కాపాడవలసిన ప్రభుత్వమే వాటిని నాశనం చేయటం తగదని విమర్శించారు. ఆర్టీసీకి చెందిన విలువైన భూములను విజయవాడలోనూ, అలాగే విశాఖలోని ప్రభుత్వ భూములను లులు మాల్ కోసం కేటాయించడం సరికాదన్నారు. నామమాత్రపు లీజుతో 99 సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వటం అంటే ఆ విలువైన భూములను ఆయా సంస్థలకు ఉచితంగా కట్టబెట్టడమేనని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొడతాం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యుత్ చార్జీలు పెంచినా, స్మార్ట్ మీటర్లు బిగించినా ప్రజా ఉద్యమం తప్పదని స్మార్ట్ మీటర్లను ఎక్కడికక్కడ పగలగొడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు విద్యుత్ సంస్కరణ నేనే తెచ్చానని చెప్పుకోవడం కాదు ఆ సంస్కరణలు ప్రజల పైన పెను భారాలుగా మారుతున్నాయన్నారు. గతంలో విద్యుత్ సంస్కరణలు విద్యుత్ చార్జీలు పెంచడంతో ప్రజా తిరుగుబాటుతో ప్రభుత్వం కూలిపోయిందని గుర్తు చేశారు. స్మార్ట్ మీటర్ బిగించడం ఎంతోమంది విద్యుత్ వెలుగుల నుండి దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. రైతులు అధిక ధరలు చెల్లించలేక వ్యవసాయం మానుకునే స్థితి వస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, విద్యుత్ సంస్థలలో అదాని ఒప్పందాలు రద్దు చేయాలని ఆగస్టు 5న జిల్లా వ్యాప్తంగా నిరసనలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి రామయ్య, ఎల్ నాగ సుబ్బారెడ్డి , ఏంవీ సుబ్బారెడ్డి , ఎస్ వెంకట శివ , జి వేణుగోపాల్ , ఎస్ విజయలక్ష్మి , వి వీరశేఖర్ , సుబ్బరాయుడు , సి.సుబ్రహ్మణ్యం , కేసీ బాదుల్లా, మద్దిలేటి , బాల ఓబయ్య, వెంకట రాములు, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంఈఓకు సన్మానం



ఎంఈఓ రఫిక్ అహ్మద్‌ను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడప నూతన ఎంఈఓ-1గా బాధ్యతలు స్వీకరించిన రఫిక్ అహ్మద్‌ను మంగళవారం ఎస్టీయూ కడప నగర శాఖ సన్మానించింది. ఈ సందర్భంగా నూతన ఎంఈఓ రఫిక్ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎల్లప్పుడూ ముందుంటానని చెప్పారు. మీరు కూడా మీ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్ఎండి ఇలియాస్ బాష, రాష్ట్ర కౌన్సిలర్ చెన్నకేశవ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మహబూబ్ బాష, నగర అధ్యక్షుడు సాదిక్ అలీ, ప్రధాన కార్యదర్శి సంజీవ రాయుడు , ఆర్థిక కార్యదర్శి అస్లం , జిల్లా మునిసిపల్ కన్వీనర్ అనిల్‌తోపాటు జిల్లా నాయకులు రాజగోపాల్‌రెడ్డి, నజీబుల్లా, ఫక్రుద్దీన్, అభయ, కడప మండల అధ్యక్షుడు జయరాం తదితరులు పాల్గొన్నారు.

కాపాడు తల్లీ... విజయదుర్గమ్మా..



కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ప్రతి మంగళవారంలాగానే ఈసారి కూడా రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. 9వ తేదీ శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, చండిహోమం , దీపాలంకార సేవ నిర్వహిస్తామని, 10 వ తేదీ ఉదయం శ్రీ విజయ దుర్గా మల్లికార్జున స్వామి కళ్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జున రావు తెలిపారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు దారుణం

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అధ్వాన్నంగా ఉందని, హాస్టల్లో మౌలిక వసతులు దారుణంగా తయారయ్యాయని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిషోర్ బూసిపాటి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు మంగళవారం కడప నగరంలోని గాంధీనగర్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి అనంతరం ప్రకాష్ నగర్ లోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రత్యేకంగా మెనూ రూపొందించి విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందజేయడం జరిగిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఒకరోజు బాగుంటే వారం రోజులు ఆహారం బాగుండడం లేదని విద్యార్థులు వాపోతున్నారన్నారు. విద్యార్థులకు గుడ్డు ఇతర పౌష్టికాహారాన్ని అందజేయాల్సి ఉండగా అరకొరగానే అందజేస్తూ చాలామంది విద్యార్థులకు మొండిచెయ్యి చూపిస్తున్నారన్నారు. మరోవైపు సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలో మౌలిక వసతులు చాలా దారుణంగా ఉన్నాయని, బాత్‌రూమ్‌లకు డోర్లు లేక చాలామంది పిల్లలు ఆరుబయటే స్నానాలు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, హాస్టల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీరంజన్ రెడ్డి, మాజీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సీహెచ్ వినోద్ కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు డాక్టర్ పెంచలయ్య పాల్గొన్నారు.



గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డ్రగ్స్ కేసులో పట్టుబడితే భవిష్యత్తు అంధకారం

కడప ఎడ్యుకేషన్: డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను కోల్పోతారని పోలీసు అధికారులు పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలు, ఈవ్ టీజింగ్‌లపై అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రేమ పేరుతో మోసాలు, మహిళలపై జరిగే నేరాలు, చట్టాలపై, సమాజంలో ఆడపిల్లలు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చిస్తూ బంగారు భవిష్యత్తు కోసం ఏవిధంగా ప్రవర్తించాలనే అంశాల గురించి వివరించారు. అలాగే రోడ్డు భద్రత విషయాల్లో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం, మైనర్లు వాహనాలు నడపకూడదని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా డయల్ 112కు కాల్ చేయడం ద్వారా పోలీసుల సహాయం పొందవచ్చని తెలిపారు.



మరియాపురం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా

కడప అర్బన్: గంజాయి, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ ఈ.జీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కడప నగరం శివారులో గంజాయి సేవనం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంచేలా చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడం తో పాటు గంజాయి ని సేవించే వారిని గుర్తించేందుకు విస్తృతచర్యలు చేపట్టారు. మంగళవారం నగరంలోని సాయిపేట, నకాష్, మోచంపేట, యానాది కాలనీ, రామకృష్ణ హైస్కూల్ సమీపంలోని ప్రాంతం పరిసరాలలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానాస్పదంగా సంచరించే వారిని గుర్తించే చర్యలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే క్షుణ్ణంగా విచారిస్తున్నారు. ఈగల్ సిబ్బంది, టూ టౌన్ పోలీసులు, డ్రోన్ ఆపరేటర్ పాల్గొన్నారు.



నగరంలో డ్రోన్‌తో నిఘా పెడుతున్న పోలీసులు

వైఎస్ జగన్‌ను కలిసిన జిల్లా నేతలు



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



వైఎస్ జగన్‌తో పి. జయచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, ఎస్. గురుమోహన్, కె. నాగేంద్రారెడ్డి కలిశారు. మంగళవారం విజయవాడ తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో వారు ఆయనను వేర్వేరుగా కలిసి తమను రాష్ట్ర కార్యదర్శులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రెడ్యం వెంకట సుబ్బారెడ్డి తన సోదరుడు చంద్రశేఖర్ రెడ్డి, కుమారుడు వెంకట సాయి ప్రత్యూష్, సోదరుడి కుమారుడు ధీరజ్‌రెడ్డి తదితరులతో వైఎస్ జగన్‌ను కలిసి శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి కూడా వైఎస్ జగన్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అంకిరెడ్డి సురేష్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు పోలీస్ గంగిరెడ్డి, ఏ. అరుణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

అంజద్‌బాషా భేటీ..

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం విజయవాడలోని తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. పీఏసీ సభ్యుడైన అంజద్‌బాషా ఆ సమావేశంలో పాల్గొన్న తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి క్షేత్రస్థాయిలోని రాజకీయ పరిస్థితులు, ప్రజల అభిప్రాయాలు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయనకు వివరించారు.

కియా నూతన కారు ఆవిష్కరణ



నూతన కారును ఆవిష్కరిస్తున్న షోరూం ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్ : కియా సంస్థ నూతనంగా రూపొందించిన కియా కారెన్స్ క్లావిస్ ఈవీ కారును మంగళవారం ఆవిష్కరించి మార్కెట్‌లోకి విడుదల చేశారు. కడప నగర పరిధిలోని హోషి ఆటో ప్రైవేటు లిమిటెడ్ కియా కార్ షోరూంలో జరిగిన కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి, డైరెక్టర్లు చెరుకు నిరంజన్, సి.భారతి, సి.హోషిమా రెడ్డిలు పాల్గొన్నారు. షోరూం ఎండీ సి.జగన్నాథ రెడ్డి మాట్లాడుతూ కియా సంస్థ విడుదల చేసిన కియా కారెన్స్ క్లావిస్ ఈవీ కారులో అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయన్నారు. కారు బుకింగ్ కోసం 9100773485 నెంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ దస్తగిరి, కొనుగోలుదారులు, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

సినారే రచనలు చిరస్మరణీయం



సినారే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు

కడప ఎడ్యుకేషన్: తెలుగు సాహిత్యంలో వందకు పైగా రచనలు చేసి ప్రత్యేకించి 'విశ్వంభర'తో విశ్వఖ్యాతినొందిన విశ్వకవి డా. సి.నారాయణ రెడ్డి (సినారె) అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మంగళవారం జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి.నారాయణరెడ్డి 95వ జయంతిని ఘనంగా నిర్వహించింది. డా. సి.నారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ సినారె రచనలు, సినీ గీతాలను గుర్తు చేశారు. సాహిత్య రంగంలో ఆయన కృషి చాలా గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు జయప్రదం చేయాలి

కడప ఎడ్యుకేషన్: నంద్యాల జిల్లా కేంద్రంలో ఆగస్టు 4,5, 6 తేదీలలో పీడీఎస్‌యు రాష్ట్ర విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని, వాటిని జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న కోరారు. మంగళవారం కడపలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నగర నాయకులు వసుంధర, భార్గవి, హర్షిణీ, రాణి, కార్తీక్, సాయి, మహేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలి

కమలాపురం : రైతులు తాము సాగు చేసుకునే పంట పొలాల్లో ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి లేదా మూడు పంటల కొకసారి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని పాచికల పాడు, సి.గోపులాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు పంటల సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువలు తదితర అంశాలపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. రైతులందరూ తమ పొలాల్లో మూడేళ్ల కొకసారి లేదా మూడు పంటల కొకసారైన భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. ఫలితాల ద్వారా తగిన మోతాదులో ఎరువులు వాడటంతో పాటు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. విత్తన శుద్ధి చేయడం వలన పైరుని తొలిదశలో వైరస్ తెగుళ్లు, రసం పీల్చే పురుగుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. వేరుశనగ పంటలో సూక్ష్మధాతు లోప నివారణ, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యల గురించి అవగాహన కల్పించారు. ఆరోగ్యవంతమైన పంటలు పండించాలంటే ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విత్తన శుద్ధి చేసేందుకు బీజామృతం తయారీని డెమో ద్వారా తెలియజేశారు.

సంకల్పబలం ఉండాలి

కడప ఎడ్యుకేషన్: జీవితంలో ఏదైనా సాధించాలనే సంకల్ప బలం ఉండాలని వైవీయూ పాలక మండలి సభ్యులు, వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఎస్ కె ఆర్ అండ్ ఎస్ కె ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన తన జీవన గమనాన్ని వివరించారు. ముఖాముఖి కార్యక్రమం లో విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. అనంతరం ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ వి సలీం బాష, ఆంగ్ల శాఖ విభాగాధిపతి పి సుజాత, కే నమ్రత, బి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.